క్రీడలతో యువతకు ఉపాధి

యలమంచిలి: యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంలో క్రీడలు ప్రముఖ పాత్ర వహిస్తాయని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం దొడ్డిపట్లలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కొంత సమయం వారితో ముచ్చటిస్తూ క్రీడా రంగంలో మన రాష్ట్ర విద్యార్థులు ముందజలో ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అందువల్ల గ్రామీణ స్థాయి నుంచే మెరికల్లాంటి క్రీడాకారులను గుర్తించడానికి ఆడుదాం ఆంధ్ర పేరిట ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు గోపి చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు బోనం బులివెంకన్న, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓదూరి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కానూరి కృష్ణారావు, ఉంగరాల మణికంఠ, కడిమి బాలరాజు, పితాని బాలాజీ, కడిమి శ్రీరామ్ ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





పోడూరు: పెనుమదంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

యలమంచిలి: దొడ్డిపట్లలో క్రికెట్ ఆడుతున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు

మేడపాడులో..

మండలంలోని మేడపాడు గ్రామంలో కూడా గురువారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి దేవ రాజేష్‌కుమార్ ప్రారంభించారు. ఇక్కడ మట్లపాలెం, శిరగాలపల్లి గ్రామాల మధ్య పోటీ జరుగగా మట్లపాలెం టీమ్ సభ్యులు విజయం సాధించారు. కార్యక్రమంలో ఆడుదాం ఆంధ్ర మండల కో–ఆర్డినేటర్ యాండ్ర సత్యనారాయణ పీడీలు ఎస్‌వీఆర్ దుర్గాప్రసాద్, బొంతు కల్యాణి పీఈటీ కె.వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోడూరులో..

పోడూరు: ఆడుదాం ఆంధ్ర పోటీలతో క్రీడాకారుల్లో ఎంతో ఉత్సాహం నెలకొందని మండల కన్వీనర్ పితాని చిన్నా అన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో భాగంగా గురువారం పెనుమదం జెడ్పీ హైస్కూల్లో వాలీబాల్ లీగ్ మ్యాచ్‌లను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు మంచి గుర్తింపునిచ్చే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులంతా ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించాలన్నారు. సచివాలయం–2 సెక్రటరీ జి.నరేష్‌బాబు మాట్లాడుతూ పోటీల్లో భాగంగా శుక్రవారం వాలీబాల్ సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ గోవిందరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్‌పై అవగాహన అవసరం



పెన్షనర్లకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం: ప్రభుత్వం పెన్షనర్లకు జీవన ధ్రువీకరణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్) సమర్పణపై అవగాహన కల్పించాలని భీమవరం ఎస్‌టీవో అల్లూరి రవివర్మ అన్నారు. భీమవరంలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం ఏర్పాటు చేసిన పెన్షనర్స్ జీవన ధ్రువీకరణ పత్రాలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈనెల 29 లోగా ధ్రువీకరణ పత్రాలను అందించాలని, దీనికి సంబంధించిన సర్టిఫికెట్స్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో లేదా ఇంటర్ నెట్ ద్వారా పొందవచ్చునన్నారు. అనంతరం పెన్షనర్స్‌కు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు.

కులగణనపై శిక్షణ

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమం మండలంలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రవీంద్ర తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులకు కులగణనపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు 10 రోజుల పాటు మండలంలో ఇంటింటికీ అధికారులు వెళ్ళి కులగణన కార్యక్రమాన్ని చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, ఈవోపీఆర్‌డీ కె.కొండలరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు ఆహ్వానం



గరికిముక్కు సుబ్బయ్య

భీమవరం: అయోధ్య శ్రీరామ జన్మభూమిలో ఈనెల 21,22,23 తేదీల్లో నిర్వహిస్తున్న నూతన రామ మందిరంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనాలని భీమవరం పట్టణానికి చెందిన ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గరికిముక్కు సుబ్బయ్యకు ఆహ్వానం అందింది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు నుంచి అందిన ఆహ్వానంలో నగర శైలిలో అయోధ్య రామ మందిరం నిర్మాణం జరిగిందని, ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదగా విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతున్నందున కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానం అందినట్లు ఆయన పేర్కొన్నారు.

కోడి పందేల నిర్వహణపై 31 కేసులు

వీరవాసరం: మండల వ్యాప్తంగా కోడి పందేలు, పేకాటలపై దాడులు చేసి 31 కేసులు నమోదు చేసినట్లు వీరవాసరం ఎస్సై పి.రమేష్ గురువారం తెలిపారు. వీరవాసరం, రాయకుదురు, జొన్నలపాలెం, నవుడూరు, అండలూరు, మత్స్యపురిపాలెం తదితర గ్రామాల్లో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తున్న వారిపై దాడులు చేసి 31 కేసులను నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.1,03,850 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై చెప్పారు.

ఆకట్టుకున్న మాయాబజారు నాటకం

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయ 60 వార్షికోత్సవ మహోత్సవంలో భాగంగా గురువారం రాత్రి అమ్మవారి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన విజయదుర్గా నాట్య మండలి పీవీ దుర్గాప్రసాద్ సమర్పించిన మాయాబజారు నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలాగే ముందుగా ప్రదర్శించిన భక్తి సంకీర్తన, హరికథ, మ్యాజిక్ షో కూడా ప్రేక్షులను అలరించాయి. జనం పెద్ద సంఖ్యలు తరలివచ్చి కళా ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు సీరుల్లి, కూరగాయ, పండ్ల వర్తక సంఘం ప్రతినిధులు, అమ్మవారు ఉత్సవ కమిటీ ప్రతినిధులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన పీవీఎల్



పాపారావును పరామర్శిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

పాలకోడేరు: గొరగనమూడి గ్రామ మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావును గురువారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పరామర్శించారు. ఇటీవల పాపారావు మోకాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆయన ఇంటికి వెళ్ళి క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. పీవీఎల్ వెంట ఎంపీపీ అధ్యక్షుడు భూపతిరాజు చంటిరాజు, విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, పంపన రామకృష్ణ తదితరులు ఉన్నారు.

సంక్షేమం అందించడమే లక్ష్యం

పెనుగొండ: ప్రతి పేదవాడికీ సంక్షేమం అందించడమే ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ అన్నారు. ఆచంట మండలం వల్లూరు గురువారం నిర్వహించిన భారత వికసిత్ సంకల్ప యాత్రలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ముచ్చర్ల నాగ సుబ్బారావు, ధార్మిక సెల్ కన్వీనరు హరి శివరామకృష్ణ, ఎంపీడీఓ నరసింహ ప్రసాద్, సర్పంచ్ నేలపూడి బేబీ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి



పట్టణంలో ఓ షాపులో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నరసాపురం: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని షాపులు, హోటళ్లలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. యజమానులతో మాట్లాడారు. 14 సంవత్సరాల లోపు బాల, బాలికలను పనిలో పెట్టుకోకూడదన్నారు. అలా చేస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారన్నారు. చిన్న పిల్లలను పనిలో పెట్టుకోమని వారి తల్లిదండ్రులు తీసుకొస్తే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపాలని చెప్పారు. పిల్లలను బడుల్లో చేర్పించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి లేబర్ ఆఫీసర్ కేబీఆర్ శర్మ, ఉచిత న్యాయవాదులు బళ్ల శ్రీహరి, నారిన శ్రీనివాసరావు, నక్కా ఆనందబాబు, కేసీహెచ్ పద్మజ పాల్గొన్నారు.

జీఆర్‌డీపీ అభివృద్ధిపై సదస్సు

ఉండి: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీఆర్‌డీపీ)పై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులకు అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రాబోతున్న నిధుల వివరాలు, వాటితో గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులపై ప్రణాళిక రూపొందించే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజల భాగస్వామ్యంతో ఏ విధంగా పరిష్కరించాలనే అంశాలను మాస్టర్ ఆఫ్ ట్రైనర్ ఎస్.శంకరం వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రవీంద్ర, ఈవోపీఆర్‌డీ కె.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పాందువ్వలో వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీల ధ్వంసం

ఉండి: మండలంలోని పాందువ్వ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం, క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చించేశారు. దీనిపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు, సోషల్ మీడియా మండల కో కన్వీనర్ గొంతే హరీష్ మండిపడ్డారు. ప్రజాభిమానం ఉన్న నాయకుడు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అని, ఫ్లెక్సీలు చించినంత మాత్రాన ఆయన గెలుపును అడ్డుకోలేరని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇతర పార్టీల ఫ్లెక్సీలు భద్రంగానే ఉంచుకుని వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను మాత్రం చించివేయడం చూస్తుంటే వైఎస్సార్ సీపీ నాయకులను చూసి భయపడుతున్నారని అర్థం అవుతుందన్నారు. సామరస్యంగా గ్రామంలో అన్ని పార్టీల వారు వారి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుంటే వైఎస్సార్ సీపీకి చెందినవి మాత్రమే చించివేసి, ముఖాలు కోసిన తీరు చూస్తుంటే వైఎస్సార్ సీపీ జెండాకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు వారెంత భయపడుతున్నారో? అర్థం చేసుకోవచ్చునని అన్నారు. ఎవరు ఎన్ని చేసినా వైఎస్సార్ సీపీ విజయాన్ని అడ్డుకోలేరని అన్నారు.

విజయవాడకు భారీగా తరలిరావాలి

నరసాపురం: విజయవాడలో శుక్రవారం జరిగే అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవానికి భారీగా తరలిరావాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. దేశానికే తలమానికంగా విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా విగ్రహం ఆవిష్కరణ ఘనంగా సాగుతుందని చెప్పారు. నరసాపురం నియోజకవర్గం నలుమూలలు నుంచి భారీగా జనం తరలి రావడానికి ఏర్పాట్లు చేశామన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటరన్‌నుంచి మొగల్తూరు నుంచి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటలకు బస్సులు ప్రారంభమవుతాయని చెప్పారు.

విగ్రహావిష్కరణకు తరలిరావాలి

మొగల్తూరు: రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో నిర్మించిన అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహం, స్మృతి వనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు ఏగి బాబి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

పోడూరులో..

పోడూరు: విజయవాడలో శుక్రవారం జరుగనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో దళితులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని మండల కన్వీనర్ పిల్లి నాగన్న పిలుపునిచ్చారు. పోడూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ఛలో విజయవాడ' కార్యక్రమానికి పోడూరు మండలంలో ఆచంట నియోజకవర్గంలోని8 గ్రామాలకు 2 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోడూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి ఉదయం 9.00గంటలకు బస్సులు బయలుదేరతాయని తెలిపారు.



ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్



చెల్లెం ఆనందప్రకాష్ ఎస్సీ కమిషన్ సభ్యుడు

పెద్ద సంఖ్యలో తరలిరావాలి..

విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, దళిత సోదరులు భారీగా తరలిరావాలని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నడిబొడ్డున బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చరిత్రాత్మక ఘట్టమని ఆయన పేర్కొన్నారు.

అంబేడ్కర్ బాటలో సీఎం జగన్

పాలకొల్లు అర్బన్: పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలని ఆలోచన చేసిన రాజనీతిజ్ఞుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, ఆయన బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. పాలకొల్లు ఏఎంసీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. శుక్రవారం విజయవాడలో అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ కాబోతుందన్నారు. అంబేడ్కర్, పూలే ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా బాసటగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచనపల్లి విన్‌స్టన్‌బాబు, సచివాలయాల జిల్లా అధికార ప్రతినిధి ఖండవల్లి వాసు, మహిళ విభాగం రాష్ట్ర కార్యదర్శి మద్దా చంద్రకళ, పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలి

పోడూరు: బీఎల్‌ఓలు, బూత్ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్‌టీవీ రాజేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఎన్నికల విధులపై బీఎల్‌ఓలకు, బూత్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో రిటర్నింగ్ అధికారి రాజేశ్వరరావు మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు, బీఎల్‌ఓలు ఎన్నికలకు సంబంధించి చేయాల్సిన విధులను వివరించారు. విధుల్లో అలసత్వం వహించకుండా జవాబుదారీతనంగా పని చేయాలని సిబ్బందికి ఆదేశించారు. బీఎల్‌ఓలు ఓటరు జాబితాను ఒకటి రెండు సార్లు సరి చూసి లోపాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సదస్సులో స్థానిక తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, ఆర్‌ఐలు కె.రాంబాబు, ఎస్.త్రిమూర్తులు, డిప్యూటీ తహసీల్దార్ డి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పోడూరులో మాట్లాడుతున్న ఎస్‌టీవీ రాజేశ్వరరావు

అపూర్వ కలయిక



సీతారాంపురంలో 50ఏళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నరసాపురం రూరల్: సీతారాంపురం నార్త్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయికను గురువారం ఘనంగా నిర్వహించారు. 50 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వారు తెలిపారు. రానున్న రోజుల్లో పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ సహచరుడైన గుంపుల జనార్దన్ మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీగా విధులు నిర్వర్తించి ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ఆయనకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చినమిల్లి వెంకట్రావు, సిర్రా జర్మయ్య, గంగిపాముల కాంతాజీ వర్దినీడి సత్యనారాయణ, కట్టా జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా దక్షిణ కాశీ శ్మశానవాటిక అభివృద్ధి



సిద్ధాంతంలో కేదారీఘాట్‌లో శ్మశాన వాటిక అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



తూర్పుపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: దక్షిణ కాశీగా పేరుగాంచిన సిద్ధాంతం కేదారీఘాట్ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం సిద్ధాంతంలో శ్మశాన వాటిక అభివృద్ధి పనులు పరిశీలించారు. కేదారీఘాట్‌లో అంత్యక్రియలు అంటే కాశీలో నిర్వహించినట్లు పరిసర ప్రాంతాల ప్రజలు భావిస్తారన్నారు. అయినా, దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. దీనితో ప్రత్యేకంగా త్వరగా అభివృద్ధి చేయాలని నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. సుందరంగా తీర్చిదిద్ది ఆహ్లాకరమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. అస్తికలు భద్ర పరచడానికి ప్రత్యేక ఏర్పాట్లుతో పాటు, వరదల సమయంలో అంత్యక్రియలకు ఇబ్బందులు లేకుండా మొదటి అంతస్తులో చేసుకొనే విధంగా నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. గోదావరీ తీరమే అయినా, వేసవిలో నీటి ఇబ్బందులు రాకుండా బోరు సదుపాయం కలిప్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), ఎంపీటీసీ సభ్యుడు చిన్నం ఏడుకొండలు, రామన్నపాలెం సర్పంచ్ యర్రంశెట్టి బుజ్జి, పార్టీ నాయకులు దామోదర్, బోళ్ల బుజ్జి, చింతపల్లి ప్రసాద్, సామ్యేలు, నానాజీ, కుడిపూడి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆచంట కమ్యూనిటీ భవనాల పరిశీలన

ఆచంటలో చేపట్టిన కమ్యూనిటీ భవనాల నిర్మాణాలను గురువారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరిశీలించారు. సత్వరం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు పెచ్చెట్టి సత్యనారాయణ, కుక్కల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి మార్గదర్శి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని, దేశానికి మార్గదర్శిగా నిలిచిన మహనీయుడు అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు కొనియాడారు. విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవ పోస్టర్‌ను గురువారం తూర్పుపాలెంలో ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాటలో నడవాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నారన్నారు. నియోజకవర్గం నుంచి ప్రతి ఒక్కరూ తరలి వెళ్లాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీలు కర్రి వాసురెడ్డి, పూతినీడి వెంకటేశ్వరరావు, పోడూరు జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఆచంట మండల సర్పంచ్ లఛాంబర్‌అ ధ్యక్షుడు సుంకర సీతారామ్, ఏపీ సీడ్ కార్పొరేషన్ డైరెక్టరు పోతుమూడి రామచంద్రరావు, విద్య మౌలిక సదుపాయాల కార్పొరేషన్ డైరెక్టరు కొవ్వూరి వేణు మాధవ రెడ్డి, సర్పంచ్ బుర్రా రవికుమార్, వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్లు పిల్లి నాగన్న, జక్కంశెట్టి చంటి, నల్లిమిల్లి బాబిరెడ్డి పాల్గొన్నారు.

పెనుగొండలో ఆసుపత్రి ప్రారంభోత్సవం

పెనుగొండలో రూ.2కోట్లుతో నిర్మించిన 30 పడకల ఆసుపత్రి భవనాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. గురువారం తూర్పుపాలెంలో నిర్వహించిన సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యుడు నూలి లక్ష్మణ స్వామి, మేడపాటి సాయి చంద్రమౌళేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతరలు



పాలకొల్లు అర్బన్: పాలమూరులో శ్రీ మారెమ్మ, శ్రీ నిలువులమ్మ అమ్మవార్ల ఊయల సేవ నిర్వహిస్తున్న భక్తులు



నరసాపురం రూరల్: జాతరను పురస్కరించుకుని అమ్మవారికి పొన్ను వేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పాలమూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ మారెమ్మ, శ్రీ నిలువులమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జాతర అనంతరం అమ్మవారికి ఊయల సేవ చేశారు. జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన నిప్పుల గుండాన్ని చిన్నారులు, మహిళలు, యువకులు, వృద్ధులు సైతం తొక్కి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం అమ్మవారిని గుడికి సాగనంపారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలకు ఆలయ ఆవరణలో పసుపు, కుంకుమ, పువ్వులు, గాజులు పంపిణీ చేశారు. ఉత్సవ కమిటి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గంగాలమ్మ వార్షికోత్సవాల్లో అన్నసమారాధన

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గంగాలమ్మ అమ్మవారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అఖండ అన్నసమారాధనను నిర్వహించారు. గత రాత్రి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని గరగ నృత్యాలతో పాటు వివిధ రకాల విచిత్రవేషధారణలు, వాయిద్యాల నడుమ ఘనంగా జాతర నిర్వహించారు. అనంతరం ఉదయం నుంచి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. తోట నాగేశ్వరరావు వ్యవసాయ క్షేత్రంలో వెలసిన ఈ అమ్మవారి వార్షికోత్సవ అత్యంత వైభవంగా నిర్వహించారు.

జిత్తిగమ్మకు బోనాల ఉత్సవం

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం జుత్తిగ గ్రామంలో ఉన్న గ్రామ దేవత జిత్తుగా అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అమ్మవారికి బోనాలు ఉత్సవం నిర్వహించి అనంతరం ఆలయావరణంలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామ సర్పంచ్ తమానంపూడి వీర్రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శి కరి రామచంద్రారెడ్డి తణుకు రెడ్డి జన సంఘం అధ్యక్షులు తమనంపూడి వీ రెడ్డి పెనుగొండ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుడిమెట్ల సాయి మురళి రెడ్డి, మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ కొవ్వూరు చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

మొగల్తూరు: స్థానిక నడివీధి ముత్యాలమ్మ జాతరను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. బుధవారం రాత్రి నిర్వహించిన ఈజాతరకు గ్రామస్తులతో పాటు, ఇతర ప్రాంతాలకు చెందిన బంధుమిత్రులు కుటుంబ సభ్యులు జాతరలో పాల్గొన్నారు. ఆసాధుల నృత్యప్రదర్శనలు, తీన్‌మార్ డప్పులు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులు భక్తులను అలరించాయి.